# ఋణం

రైల్వే స్టేషన్...

సంతోష్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. "వస్తున్నా.. బై.. పొద్దుగాల ట్రైన్ దిగేసరికీ నువ్వు స్టేషన్‌లో ఉండాల... జబర్దస్త్ పోరీ... నువ్వు నలభై వేలిచ్చినా నువ్వో వారంలో కమాయించేస్తావ్. బలే బకరా దొరికిందిలే. నేనెక్కువ తక్కువ చెప్ప... పాలకోవాని తెస్తున్నా... అగో.. ఆ పోరి నా కోసమే వెయిటింగ్ చేస్తుంది. నువ్ ఫోన్ పెట్టెయ్. ఉంటా మరి... మద్దెల్నా మళ్ళీ ఫోన్ గిట్టా చెయ్‌కు. గీ సంతోష్ మాట మీద భరోసా పెట్టుకో..."

ఫోన్ నొక్కి జేబులో పెట్టుకున్నాడు. సంతోష్– పోర్టర్ పక్కనే వున్నాడని సంతోష్ గమనించలేదు. సంతోష్ దుర్మార్గాన్ని మాత్రం పోర్టర్ గమనించాడు.

మెరుపు వేగంగా.. దూరంగా నిలబడ్డ బకరాకేసి అతను పరుగెత్తాడు పోర్టర్ గణేష్.

"అమ్మా... మీ పేరు బకరానా?"

"ఏం మాట్లాడుతున్నావ్?"

"అట్లా కాదమ్మా... నే చెప్పేది కొంత వినండి"

బకరా అనబడే ఆ బంగారుతల్లి పేరు... యామిని.

సంతోష్ బొంబాయిలో వేషం ఇప్పిస్తానని ఆ అమ్మాయిని మభ్య పెట్టాడు.

మేకప్ మ్యాన్‌గా యామినిని అలంకరించిన చేతులే ఆ అమ్మాయి జీవితాన్ని అధోగతిలోకి నెట్టేస్తాయని ఆ అమ్మాయి ఊహించలేకపోయింది.

"ఏంట్రా నువ్వు చెప్పేది... నువ్వు ఎవడసలూ..." అంది యామిని.

"నేనెవరో మీకు చెప్పినా తెలీదమ్మా. మీ పేరు యామిని. కృష్ణశాస్త్రిగారి అమ్మాయివి బాగా చదువుకున్నావ్. సంస్కారముంది. టీవీల్లో మీకు మంచి పేరుంది"

"నా గురించి నీకు యిన్ని వివరాలెలా తెలుసు" అయోమయంగా అనుమానంగా అడగలేక అడిగింది యామిని.

"నేను చెప్పేది మీరు నమ్మితే చాలు. మిమ్మల్ని బొంబాయి తీసుకెళ్తున్నది సంతోష్ అనేవాడు కదండీ"

యామిని షాకైంది. ఏం మాట్లాడలేదు.

"మిమ్మల్ని ట్రైన్ ఎక్కించకుండా కాపాడగలిగితే నా మాస్టారు రుణం నేను తీర్చుకున్నవాడినవుతాను"

"నువ్వు...? మా నాన్న శిష్యుడివా?" అడిగింది యామిని.

"మీ నాన్న నా గురువు కాదమ్మా దేవుడు. ఓ రోజు ఇలాగే దొంగపని చేస్తోన్న నన్ను చేరదీసి నాలుగు అక్షరాలు నేర్పించి మాట్లాడ్డం... మర్యాదగా వుండటం... నేర్పించారు. అప్పుడు మిమ్మల్ని చూసేవాణ్ణి. చెంగు చెంగున దూకే చిన్న లేడిపిల్లలా అనిపించేవారు... మాస్టారు పోయినప్పుడు నేనూ వచ్చాను. మిమ్మల్ని ఓదార్చడం నాకు చేతకాలేదు. నన్ను ఓదార్చేవాళ్ళు ఎవరూ లేక నాలో నేనే కుమిలిపోయాను. మాస్టారు నా జీవితాన్ని ఓ దారిలో పెట్టిన మహానుభావుడు. మీరు పైకొచ్చారు. మా ప్లాట్‌ఫాంలో

టీ.వీ. ప్రోగ్రాంలు వేస్తుంటారు కదా. దాంట్లో మిమ్మల్ని చూసినప్పుడల్లా మా మాస్టారమ్మాయి అని పని ఆపేస్తానమ్మా. మీ కథ అయ్యేవరకూ ఎంత గిరాకీ వచ్చినా కదలలేను. మీరు ఇంకా ఇంకా ఎదిగి మీ యింటిని నిలబెట్టాలని ఎంతగానో అనుకున్నాను. ఆ చనువుతోనే మిమ్మల్ని పలకరించాను. మీరు గోతిలో పడిపోతున్నారమ్మా కాదు... రైలు కింద పడి నలిగిపోతున్నారమ్మా"

యామిని "నీ పేరేంటి?"

"పోన్లేమ్మా... నా పేరు తెలుసుకోవాలనిపించింది. నా పేరు వల్ల నీకే లాభంవున్నా లేకున్నా నేను మీకు సాయపడితే చాలు ఆ బద్మాష్ సంతోష్‌గాడు మిమ్మల్ని బొంబాయిలో అమ్మేయడానికి బేరం కుదుర్చు కున్నాడు"

"షటప్. ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా" యామిని పోర్టర్‌ని దాటుకుంటూ సంతోష్ వైపు వెళ్లింది.

గణేష్ షాకయ్యాడు.

ట్రైన్ రావటానికి యింకెంతో టైం లేదు.

కృష్ణశాస్త్రిగారి అమ్మాయిని కాపాడాలి.

గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయ్.

"యామినిగారూ... నా మాట వినండమ్మా. సంతోష్‌ని నమ్మకండమ్మా" అన్న అతని అభ్యర్థన అరణ్య రోదనమే అయ్యింది.

పోర్టర్ గణేష్ ఏం చెయ్యాలా అని పరిగెత్తాడు.

✦ ✦ ✦

"ఈ అమ్మాయిని ఎందుకు బొంబాయి తీసుకెళ్తున్నావ్?" అడిగాడు

ఎస్.ఐ.

"మా ట్రైన్ టైం అయిపోతోంది. మీరు పోలీస్ స్టేషన్‌కి ఎందుకు తెచ్చారు?" సంతోష్ గర్జించాడు.

"అడిగిందానికి సమాధానం చెప్పు. ఈ అమ్మాయిని బొంబాయి ఎందుకు తీసుకెళ్తున్నావ్?" ఎస్.ఐ. హూంకరించాడు.

యామిని కలిగించుకుంటూ "సార్... నేను టీవీ ఆర్టిస్టుని. బాంబేలో నాకింకా మంచి ఆఫర్స్ వస్తాయని వెళ్తున్నాను. మా ఇండస్ట్రీ గురించి మీకంతగా తెలియదనుకుంటా. ఒక్కసారి హిందీ ఆర్టిస్టుగా కన్పిస్తే బాలీవుడ్‌లోనూ, టాలీవుడ్‌లోనూ టాప్‌స్టార్ అవ్వొచ్చు. సంతోష్ ఈజ్ మై పర్సనల్ అసిస్టెంట్ అండ్ మేకప్ ఆర్టిస్ట్"

"నో.. సార్.. వీడు చాలా దుర్మార్గుడు. అతని సెల్ తీసుకోండి నేను చెప్తా" అన్నాడు గణేష్.

సంతోష్ యివ్వడానికి మొరాయించాడు. ఎస్.ఐ. సెల్ లాక్కుని రీడయల్ చేశాడు. నిజం తెలిసిపోయింది.

యామిని షాకైంది.

సంతోష్‌ని చెంపదెబ్బ కొట్టి చెక్కిళ్ళమీద నీళ్ళు ప్రవహిస్తుండగా గణేష్ కాళ్ళకి మొక్కింది.

"చూడమ్మా... మాస్టార్‌గారి అమ్మాయివి. నువ్వు బావుంటే మా జీవితానికి మార్గం వేసిన దేవుడి రుణం కొంత తీరుతుంది" అని కన్నీళ్లు పెట్టుకుని దణ్ణం పెట్టాడు గణేష్.

ఆ తర్వాత సంతోష్ కటకటాల చువ్వలు ఎన్నిసార్లు లెక్కెడుతూ.. ఎన్నాళ్లు కూర్చున్నాడో..!!